శాంతిచర్చలు జరపాల్సిందే

- ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి
- కర్రెగుట్టలో సాయుధ బలగాలను ఉపసంహరించాలి
- వనరులను కార్పొరేట్లకు అప్పగించొద్దు
- కేంద్రానికి వామపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలను జరపాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని కోరారు. కర్రెగుట్ట ప్రాంతాన్ని సాయుధ బలగాలు మోహరించి నరమేధం సృష్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. కర్రెగుట్ట ప్రాంతం నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు, అటవీ ప్రాంతానికి రాజ్యాంగం ఇచ్చిన రక్షణలను, ప్రత్యేక హక్కులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఘాతం కలిగిస్తున్నదని విమర్శించారు. అక్కడి విలువైన సహజ వనరులు, నిక్షేపాలను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ఈ యుద్ధాన్ని సాగిస్తున్నదని అన్నారు. ఆదివాసీలను అక్కడి నుంచి వెళ్లగొట్టడం కోసమే కగార్ యుద్ధాన్ని చేస్తున్నదని వివరించారు. దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సైనికులు, సాయుధ బలగాలను దించి హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా దేశ పౌరులను పిట్టల్లా కాల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ ప్రతిపాదించిందని గుర్తు చేశారు. దీనికి కేంద్రం అంగీకరించి శాంతిచర్చలను బేషరతుగా ప్రారంభించాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

ఫాసిస్టు పంథాలో ముందుకెళ్తున్న కేంద్రం : కూనంనేని

మావోయిస్టులు తప్పు చేస్తే రాజ్యాంగం ప్రకారం కేసులు నమోదు చేసి శిక్షించాలి తప్ప వారిని చంపే హక్కు కేంద్రానికి ఎక్కడిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. చర్చలకు వస్తామంటూ మావోయిస్టులు ప్రతిపాదిస్తున్నా కేంద్రం యుద్ధ చేయడం ఎంత వరకు సమంజసమని అడిగారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ఫాసిస్టు ధోరణితో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. 1952లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సమయంలోనూ ఇంత నిర్బంధం లేదన్నారు. 2026, మార్చి నాటికి మావోయిస్టుల్లేకుండా చేస్తామంటూ కేంద్రం ప్రకటించడంతోపాటు ఫాసిస్టు పంథాలో ముందుకెళ్తున్నదని విమర్శించారు. పరాయి దేశాల మీద యుద్ధం చేసినట్టు సొంత దేశంలోని పౌరులపై యుద్ధం కొనసాగిస్తున్నదని అన్నారు. మావోయిస్టులను తుదముట్టిస్తామంటూ ప్రతిజ్ఞ చేసి చంపడం దుర్మార్గమన్నారు. దీన్ని న్యాయ స్థానాలు సుమోటోగా స్వీకరించాలని కోరారు. మావోయిస్టులు అడవులను గానీ, అక్కడ ఉన్న సంపదను కానీ స్వాధీనం చేసుకోలేదనీ, అమాయక ప్రజలైన ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం పోరాడుతున్నారని అన్నారు. కేంద్రాన్ని ఎవరూ ప్రశ్నించొద్దు, పేదల పక్షాన ఎవరూ మాట్లాడొద్దనే ధోరణితో ఉందన్నారు. ఇది సరైంది కాదని చెప్పారు.

జమ్మూకాశ్మీర్‌లో ఆపరేషన్ కగార్‌ను చేపట్టాలి : జూలకంటి

కర్రెగుట్ట ప్రాంతంలో కేంద్రం దుర్మార్గం వ్యవహరిస్తూ మావోయిస్టులను హతమారుస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. అక్కడ ఎవరూ ఉండకుండా అందర్నీ చంపేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్రం చేపట్టిందన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు సామాన్యులను పొట్టన పెట్టుకుంటున్నారని అన్నారు. కేంద్రానికి దమ్ముంటే జమ్మూకాశ్మీర్‌లో ఆపరేషన్ కగార్‌ను చేపట్టాలనీ, ఉగ్రవాదులను తుదముట్టించాలని డిమాండ్ చేశారు. దాన్ని ప్రజలు హర్షిస్తారని చెప్పారు. కర్రెగుట్ట ప్రాంతంలో ఉండే ఖనిజ సంపద కోసమే ఈ యుద్ధాన్ని చేస్తున్నదని అన్నారు. ఆ సంపదను కొల్లగొట్టొద్దనీ, కార్పొరేట్లకు అప్పగించొద్దని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి, ఆ ప్రాంతం అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించాలని కోరారు. శాంతి చర్చలు జరపాలంటూ ప్రధానికి సిఎం రేవంత్‌రెడ్డి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కెజి రాంచందర్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా మావోయిస్టులో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్ట దండకారణ్యంలో నరమేధాన్ని ఆపాలని కోరారు. పేదరికాన్ని, ఆదివాసీల సమస్యలను నిర్మూలించకుండా మావోయిస్టులను చంపడం సరైంది కాదన్నారు. మావోయిస్టులను చంపితే వేరే రూపంలో ప్రభుత్వాలను ప్రశ్నిస్తారని చెప్పారు. మావోయిస్టుల అంతం చూడాలనే ధోరణిని కేంద్రం విడనాడాలని, శాంతిచర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ(ఎంఎల్) నాయకులు కె గోవర్ధన్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మే 2న హైదరాబాద్‌లో సెమినార్

కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపేసి మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరపాలంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వచ్చేనెల రెండున హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సెమినార్‌ను నిర్వహించనున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. ఈ సదస్సులో వామపక్ష పార్టీల నాయకులతోపాటు మేధావులు పాల్గొంటారని వివరించారు. ఈలోపు కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

పహల్గాం దాడి ఎవరి వైఫల్యమో?

- ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి
- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




పహల్గాం ఉగ్రవాదుల దాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యామా? ఇంటెలిజెన్స్ వైఫల్యామా? ఎవరి వైఫల్యమో? ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 140 ఏళ్ల చరిత్ర గలిగిన కాంగ్రెస్ పార్టీపై ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం ద్వారా పవన్ దుష్ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. కాంగ్రెస్ లౌకిక భావజాల సిద్ధాంతం ఉన్న పార్టీ అనీ, దేశాన్ని రక్షించడంలో ముందు భాగాన ఉంటుందని తెలిపారు. ఈ వాస్తవాలను మరిచిన పవన్ ప్రధాని మెప్పుకోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. అంతగా కావాలనుకుంటే ఏడు రేస్ కోర్స్‌లో డాన్స్ చేసి ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకోవాలని సూచించారు. లేకపోతే రాజకీయాలు మానేసి రెండు సినిమాల్లో నటించి ప్రధాని మెప్పు పొందాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడి ప్రజల మనోభావాలు దెబ్బతీయొద్దని కోరారు. బిజెపి నాయకుల మాదిరిగా తాము కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం లేదని విమర్శించారు. ఉగ్రవాద ముష్కరులు భారతీయులను కాల్చిపోతే మోడీ పిట్ట కథలు చెబుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజుల నుంచి వారిని అరెస్టు చేయకుండా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

నేడే టెన్త్ ఫలితాలు

- మధ్యాహ్నం విడుదల చేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేస్తారు. గతనెల 21 నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ నెల ఏడో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ ఫలితాల కోసం https://results.bsetelangana.org, https://results.bse.telangana.gov.in, https://bse.telangana.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది కొత్తగా పదో తరగతి విద్యార్థులకు మార్కులతోపాటు సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా మార్కుల మెమోలను విద్యార్థులకు ఇస్తారు.

కాళేశ్వరం న్యాయ విచారణకమిషన్ గడువు పెంపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోనెల పాటు పొడిగించింది. ఈ మేరకు జీవో నెంబరు 17ను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. గతంలో నాలుగుసార్లు పెంచి గడువును పెంచారు. మరో నెల రోజుల్లో న్యాయకమిషన్ విచారణ ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



తునికిబొల్లారంలో ఆజాద్ ఇంజనీరింగ్ కొత్త ప్లాంటు

- జిఇ వెర్నోవాతో వ్యూహాత్మక ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో అగ్రగామి అయిన ఆజాద్ ఇంజనీరింగ్ సంస్థ హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో సరికొత్త ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపింది. జిఇ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ కోసం ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఓ సరికొత్త మైలురాయిను చేరినట్లు ఆ సంస్థ పేర్కొంది. 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక యూనిట్‌ను జిఇ వెర్నోవా ఉన్నతాధికారులు లీన్ లీడర్ రొడోల్ఫో టోరెస్, సోర్సింగ్ లీడర్ అంకుర్ చందక్, గ్లోబల్ కమోడిటీ లీడర్ మార్టిన్ షేఫర్, సప్లయర్ క్వాలిటీ లీడర్ అఖనా కబాకా, గ్లోబల్ ప్లానింగ్ లీన్ లీడర్ కార్లీ లోరెన్స్, ఆజాద్ ఇంజినీరింగ్ సిఇఒ, ఛైర్మన్ రాకేష్ చొప్దార్ ఉన్నారు.

ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ డిశ్చార్జ్

- మమ్మల్ని గుర్తు పట్టడంలేదు.. శ్రీతేజ్ తండ్రి భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయ్యాడు. గతేడాది డిసెంబర్ 4న పుష్ప- 2 చిత్రం ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయాలపాలై సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి కాస్త నిలకడగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇక్కడి నుంచి రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించాలని వైద్యులు సూచించారు. అక్కడ 15 రోజుల పాటు ఉంచి ఫిజియోథెరఫీ వంటివి నిర్వహించాక ఇంటికి తీసుకెళ్లొచ్చని సూచించినట్లు సమాచారం. శ్రీతేజ్‌కు మొత్తంగా 4 నెలల 25 రోజుల పాటు ఆస్పత్రిలో వైద్యం కొనసాగింది. గత 15 రోజుల నుంచి ఐసీయూ నుంచి రూమ్‌కి షిఫ్ట్ చేశారు. బాబు ఆరోగ్య పరిస్థితి కొంచెం ఇన్ఫెక్షన్లు లేకుండా నిలకడగా ఉంది. వైద్యులు రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. ఆ తర్వాత ఇంటికి తీసుకెళ్లొచ్చని తెలిపారు. ఇప్పుడు కళ్లు తెరిచి చూస్తున్నాడు. ద్రవాహారం మాత్రమే పైపు ద్వారా పంపిస్తున్నాం. బ్రెయిన్ అయితే ఇంకా రికవరీ కాలేదు. మమ్మల్ని గుర్తు పట్టడంలేదు. ఆస్పత్రిలో ఎన్ని రోజులు ఉన్నా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుందని.. రిహాబిలిటేషన్‌కు తీసుకెళ్తే కొంత మెరుగుపడొచ్చని వైద్యులు సూచించారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు. పుష్ప- 2 చిత్రం యాజమాన్యం, సిఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నుంచి మాకు బాగా మద్దతు లభించిందని ఆయన తెలిపారు. బాబు ఆస్పత్రిలో చేరిన రెండో రోజు నుంచే మాకు సపోర్టు అందింది. ఇప్పటికీ మమ్మల్ని వైద్యులు, కిమ్స్ యాజమాన్యం డబ్బులు అడగలేదు. డిశ్చార్జి సమయంలో ఏమీ బలవంతం చేయలేదు. శ్రీతేజ్ చెల్లెలు అమ్మ ఏది? అని అడుగుతోంది. ఊరెళ్లిందని చెబుతున్నాం. బాబుని చూసేందుకు పాపను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పుడు.. తను మాట్లాడుతున్నా శ్రీతేజ్ స్పందించడం లేదన్నారు. తమకు సపోర్టు చేసిన అందరికీ భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌జి ప్రచారకర్తగా వంటిక అగర్వాల్



హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ ఎల్‌జి ఇండియా తన బ్రాండ్ అంబాసీడర్‌గా అర్జున అవార్డ్ గ్రహీత వంటిక అగర్వాల్‌ను నియమించుకున్నట్లు తెలిపింది. ఈ యువ మహిళా గ్రాండ్ వంటికతో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా కొత్త ప్రయాణాన్ని కలిసికట్టుగా ప్రారంభించడానికి ఉత్సాహంగా ఉన్నామని ఎల్‌జి ఇండియా ఎండి హాంగ్ జు జియోన్ పేర్కొన్నారు.

9,10 తేదీల్లో గ్రామీణ కార్మిక మహిళల జాతీయ సదస్సు

- ముఖ్య అతిథిగా కేరళ సిఎం పినరయి విజయన్
- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ కార్మికుల సమస్యలు, గ్రామీణ ఉపాధి మహిళల స్థితిగతులపై వచ్చే నెల 9,10 తేదీల్లో కేరళలోని మల్లాపురంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయు) ఆధ్వర్యంలో 'జాతీయ సదస్సు'ను నిర్వహిస్తున్నామని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. దేశవ్యాప్తంగా 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. మంగళవారం కర్నాటకలోని గుల్బర్గాలో నిర్వహించిన గ్రామీణ ఉపాధి కార్మిక మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. మల్లాపురంలో జరిగే జాతీయ సదస్సులో కేరళ సీఎం పినరయి విజయన్, సిపిఎం సీనియర్ నేత బృందా కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు వాసుకి, ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ ప్రసగించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగం, గ్రామీణ ఉపాధిలో మహిళల పాత్ర రోజు రోజుకూ పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మికుల్లో 60శాతం నుంచి 70 శాతం వరకు మహిళలే ఉన్నారని పేర్కొన్నారు.వారికి సమాన వేతనం, భూమిపై హక్కులు లభించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు గ్రామీణ ధనిక వర్గాలకు అనుకూలంగా ఉండటంతో మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పేరుతో భూమి పట్టాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని విమర్శించారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందడం లేదనీ, మద్యం వల్ల మహిళల జీవితాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. పేద మహిళలపై వైద్య ఖర్చుల భారం పెరిగిందనీ, దాంతో వారు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పట్ల వివక్ష మరింత పెరిగిందని విమర్శించారు. మహిళా కూలీలపై లైంగికదాడులకు పాల్పడుతున్న దుండగులకు ఆయా ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో హిందుత్వ, మనువాద భావజాలాన్ని కూలీ మహిళల మధ్య వ్యాపింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా గ్రామీణ మహిళల్లో చైతన్యం తీసుకొచ్చే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ పేద మహిళలను సమీకరించడం ద్వారా నూతన ధనిక వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మంగమ్మ, సావిత్రమ్మ, శేఖమ్మ, చంద్రప్ప, పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యం

- ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యమ ఆకాంక్షల సాధనే తెలంగాణ జన సమితి లక్ష్యమని ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు తెలిపారు. పార్టీ 7వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల్లో నిరుద్యోగుల సమస్యలు, ఆదివాసీలు హక్కులు, జాబ్ క్యాలెండర్, ధర్నాచౌక్ రక్షణ వంటి ఉద్యమాలు, పోరాటాల్లో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. బిఆర్ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించడంలో పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో టిజెఎస్ పాత్ర కీలకమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా టీజేఎస్ నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్ కుమార్, ఆశప్ప, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, మహిళా జన సమితి అధ్యక్షురాలు లక్ష్మి, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు జస్వంత్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, యువ జన సమితి నాయకులు కొత్త రవి, ఎర్ర వీరన్న విద్యార్థి జన సమితి అధ్యక్షులు మాసంపల్లి అరుణ్, ప్రశాంత్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

దేశచరిత్రలోనే అతిపెద్ద తప్పిదం కాళేశ్వరం నిర్మాణం

- ఎన్‌డిఎస్‌ఎ నివేదిక చెప్పిందదే
- బిఆర్ఎస్ నిర్లక్ష్యమే దెబ్బతీసింది
- మంత్రి ఉత్తమ్ విమర్శ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ చరిత్రలోనే మానవ కట్టడాల్లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అతిపెద్ద తప్పిదం కాళేశ్వరం నిర్మాణమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. రెండు రోజుల క్రితం వచ్చిన ఎన్‌డిఎస్‌ఎ నివేదిక అదే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. దేశంలోనేగాక ప్రపంచంలోనే సాగునీటి ప్రాజెక్టుల కనీస ప్రమాణాలు పాటించలేదని నివేదికలో ఉందని వ్యాఖ్యానించారు. రూ. లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ నేతల నిర్లక్ష్యమే కాళేశ్వరాన్ని దెబ్బతిసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపి బలరామ్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఉన్నట్టు ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా బిఆర్ఎస్ నేతలు సిగ్గుపడడంలేదని మంత్రి అభిప్రాయపడ్డారు. 'ఎన్‌డిఎస్‌ఎ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి ' కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టును కనీసం భూసార పరీక్షలు చేయకుండా, సాంకేతిక అంశాలను పట్టించుకోకుండానే నిర్మించారని ఆరోపించారు. లంచాల కోసం ప్రాజెక్టు అంచనాలను పెంచుకుంటూ పోయారని చెప్పారు. రూ. 80 వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే, ఇప్పటికే రూ. లక్ష కోట్లు దాటిపోయిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కార్పొరేషన్ల పేర తెచ్చిన అప్పులకు ఏడాదికి రూ. 16 వేల కోట్లు వడ్డీ కడుతున్నామని వివరించారు. 'ఆయా పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు..అధిక శాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తెచ్చారు. బిఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఎన్‌డిఎస్‌ఎ అనేది పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు బిఆర్ఎస్ ఎంపిలు మద్దతిచ్చారు.బ్యారేజీల భద్రతను పర్యవేక్షించేది ఎన్‌డిఎస్‌ఎ అత్యున్నత బోర్డే. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తుంది. ఆయా అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది' అని తెలిపారు. తుమ్మిడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డిఎస్‌ఎ చెప్పిందని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ ప్రతిపాదనను సిడబ్ల్యుసి ప్రారంభంలోనే తోసిపుచ్చింది. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి.లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సర్వే పట్టించుకోకపోవడంతో నష్టతీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై బిఆర్ఎస్ ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలిభాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి కనీసం భూసార పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ ఉందని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక చెబుతోంది. నిర్మాణం ప్రారంభించి ఆరు నెలల తర్వాత సిడబ్ల్యుసికి డిపిఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని కెసిఆర్ ఏర్పాటు చేసిన ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో నిపుణుల బృందమే చెప్పింది. సిడబ్ల్యుసికి ఇచ్చిన డిపిఆర్‌లోనూ తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డిపిఆర్‌కు విరుద్ధంగా కెసిఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. బిఆర్ఎస్ నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయింది' అని ఉత్తమ్ విమర్శించారు. డిపిఆర్ ప్రకారం కాకుండా అన్నారం 2.2 కి.మీ, సుందిళ్ల 5.4 కి.మీ దూరంలో నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యామ్ భద్రత నిబంధనలను పాటించలేదని తెలిపారు. ఎక్కువ వడ్డీకి షార్ట్‌టర్మ్‌లోన్లు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని చెప్పారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం డిజైన్లు మార్చేశారని ఆరోపించారు. కాళేశ్వరంలో నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు నష్టం జరిగిందని వివరించారు. తుమ్మిడిహెట్టి దగ్గర నీరు లేదనడం పచ్చి అబద్ధమని వ్యాఖ్యానించారు. చేసిన తప్పుకు తలదించుకోవాల్సింది పోయి విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. వాళ్ల హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ కట్టారనీ, వాళ్ల హయాంలోనే కూలిపోయిందని అన్నారు. ప్రాజెక్టు కట్టినప్పుడు, కూలినప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వమే ఉందనీ, కెసిఆర్ సిఎం అని గుర్తు చేశారు. ఈ విషయాన్ని క్యాబినెట్ లో చర్చిస్తామనీ, దేశంలోని చట్టాల ప్రకారం తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

యూరో అడెసివ్ బ్రాండ్ అంబాసిడర్‌గా పంకజ్ త్రిపాఠి



ముంబయి : జ్యోతి రెసిన్స్ అండ్ అడెసివ్స్ లిమిటెడ్‌కు చెందిన యూరో అడ్హెసివ్స్ తన బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు పంకజ్ త్రిపాఠిని నియమించుకుంది. పంకజ్ తమ తొలి ప్రచారకర్త అని పేర్కొంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం తమ బ్రాండ్ దేశీయంగా కార్యకలాపాలను విస్తరించడానికి, వినియోగదారులను పెంచుకోవడానికి దోహదం చేయనుందని ఆ సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది.

గొడౌన్‌లో స్టాక్ రిజిస్టర్ల తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల కేంద్రంలో ఉన్న గోడౌన్, మంచుకొండ గిడ్డంగుల సంస్థ గోడౌన్‌లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ చేస్తున్న సన్న బియ్యాన్ని పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న నిల్వ, రికార్డులను, రిజిస్టర్‌లను, భద్రత తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోడౌన్‌లో నిర్లక్ష్యానికి, అవినీతికి పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సన్న బియ్యం గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న రాయల నాగేశ్వరరావు

వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో పోలీసుల సోదాలు

- పది మందిపై కేసు.. రూ.11 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఇష్టారాజ్యాంగా కొనసాగుతున్న వడ్డీ వ్యాపారంపై పోలీసులు దాడులు చేశారు. ఎస్పిగా డివి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించగానే 2024లో వడ్డీ వ్యాపారుల ఇండ్లపై పెద్దఎత్తున దాడులు నిర్వహించడంతోపాటు నగదు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అదే తరహాలో ఎస్పి ఆదేశాలతో ఎఎస్పి చిత్తరంజన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఏకకాలంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 15 టీములుగా ఏర్పడి దాడులు చేశారు. జిల్లా కేంద్రంలో అక్రమంగా చిట్టీలు, ఫైనాన్స్‌లు, వడ్డీలు నడుపుతున్నారన్న ఫిర్యాదులతో పలువురు ఇండ్లను తనిఖీ చేశారు. వారందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఎఎస్పి చిత్తరంజన్ వివరాలు వెల్లడిస్తూ.. అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న పదిమందిపై కేసు నమోదు చేయడంతోపాటు వారి వద్ద అక్రమంగా నిలువ ఉంచిన రూ.11 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి బ్లాంక్ చెక్స్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బాండ్ పేపర్స్, ప్రామిసరీ నోట్స్, ఎటిఎం కార్డ్స్ సీజ్ చేసినట్టు వివరించారు. ఈ సోదాల్లో ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిస్‌వరల్డ్ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అతిథులు బస చేసే చోట కట్టుదిట్టమైన భద్రత
- విభాగాల వారీగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఎలాంటి లోటు రాకుండా పకడ్బంది ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అందాల పోటీల ఏర్పాట్లపె మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో పర్యాటక శాఖ, పోలీసు, ఇతర విభాగాలపై మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. విస్‌వరల్డ్ పోటీల ఏర్పాట్ల వివరాలను అధికారులు ఈ సందర్భంగా సిఎంకు వివరించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న శాఖల మధ్య సమన్వయం, తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హెూటళ్లతోపాటు పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈవెంట్‌కు వచ్చే అతిథులు తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిఎం సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు నరెందర్‌రెడ్డి, డిజిపి జితెందర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్‌రంజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

మే 7 నుంచి 31 వరకు...

మే 7 నుంచి 31వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను ప్రపంచానికి తెలియజేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. దేశ, విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయి. మే 12న బుద్ధవనంలో పోటీదారులతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హైదరాబాద్‌లో హెరిటేజ్ వాక్‌లు నిర్వహించనున్నారు. మే 13న చౌమహల్లా ప్యాలెస్‌లో అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరుప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగా లబ్ది చేకూరుతుందని ప్రభుత్వ భావిస్తోంది.



గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం

- రూ.18 లక్షలు విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం
- నలుగురిపై కేసు నమోదు, అరెస్ట్
- ఆదిలాబాద్ ఎస్పి అఖిల్ మహాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పి అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం ఇచ్చోడ సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలంలో పట్టుకున్న గంజాయి మొక్కల వివరాలను ఎస్పి వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. సల్యాద గ్రామంలో అక్రమంగా పంట పొలాల మధ్యలో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నలుగురి పంట పొలాల్లో 180 గంజాయి మొక్కలు లభించాయి. వాటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.18లక్షల వరకు ఉంటుంది. ఆ గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేశారు. చహకటి సోనేరావు చేనులో 17మొక్కలు, దుర్వా లవకుష్ 86, అర్క జంగుబాపు 31, దుర్వా అరుణ్ చేనులో 46 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క గంజాయి మొక్క బహిరంగ మార్కెట్లో రూ. పది వేల వరకు ఉంటుంది. నలుగురిపై సెక్షన్8(బి)ఆర్/డబ్ల్యూ20(ఎ)(ఐ)ఎన్డిపిఎస్ చట్టం-1985తో నాలుగు కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలూ కష్టపడుతోందని ఎస్పీ అన్నారు. గంజాయి సాగు, సరఫరాపై ప్రత్యేక బృందాలను ఏర్పాట చేశామని ఎస్పీ వివరించారు. ఎలాంటి సమాచారాన్నైనా మెసేజ్ యువర్ ఎస్పీ నంబర్ 8712659973కు సమాచారాన్ని అందించొచ్చని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విలేకరుల సమావేశంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్, సిఐ భీమేష్, ఎస్‌ఐ తిరుపతి పాల్గొన్నారు.

వికలాంగుల చట్టాల అమలులో విఫలం

- ప్రత్యేక అవసరాల విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలి
- ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ ఆటీజం అవేర్‌నెస్ దినోత్సవం సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో, ఎల్ఐసి సౌజన్యంతో మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "వికలాంగుల చట్టాల అమలు-అనుభవాలు, మానసిక వికలాంగుల సమస్యలు-ప్రభుత్వం చేయాల్సిన కృషి" అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన వహించగా.. ఎన్ఐహెచ్‌హెచ్ ప్రొఫెసర్ రాజేందర్‌కుమార్ పోరిక, ఎల్ఐసి సిసి ఇన్‌చార్జ్ వి సుబ్రహ్మణ్యం, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షులు గిరిదర్‌శర్మ ప్రసంగించారు. 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ అమలుల్లోకి రావడం వల్ల మానసిక వికలాంగులకు భరోసా దొరికిందన్నారు. ఐక్యరాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. నేషనల్ ట్రస్ట్ ఆటీజం, బుద్ధి మాంద్యత, సెరిబ్రాల్ పాల్సి, బహుళ వైకల్యం గల వారికి రక్షణ కల్పిస్తుందని తెలిపారు.

వికలాంగుల చట్టాలను సవరించేందుకు కేంద్రం కుట్రలు : ఎం అడివయ్య

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వికలాంగుల చట్టాల్లో మార్పులు చేయాలనీ, సవరించేందుకు కుట్రలు చేస్తోందని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఆటీజంతో బాధపడే చిన్నారుల సంఖ్య పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటిజంను వైకల్యంగా గుర్తించినట్టు తెలిపారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం విద్య, ఉపాధి అవకాశలతోపాటు పునరావాస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆటిజం నివారణకు పని చేస్తున్న సంస్థలకు పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆటిజం రుగ్మత కలిగిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేయాలని కోరారు. ఆటిజం, మానసిక వైకల్యం కలిగిన వారికి రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆటిజం, మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రభుత్వమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక హోం నిర్మించాలని, ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ స్కూల్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్, ఆటిజం థెరపీ కేంద్రాల నిర్వహణకు నిబంధనలు రూపొందించాలని కోరారు.

అనుమతిలేని సెంటర్స్‌పై చర్యలు తీసుకోవాలి : కె.వెంకట్

ఆటిజం సెంటర్ల నిర్వాహకులు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అన్నారు. ప్రభుత్వ అనుమతి లేని థెరపీ కేంద్రాలను మూసేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ స్కూల్స్, ఆటీజం, చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్ కేంద్రాల్లో ఫీజులను నియంత్రిస్తూ ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే హైదరాబాద్ నగరంలో వందలాది సెంటర్స్ నడుస్తున్నాయని, ట్రేడ్ లైసెన్స్ తీసుకుని క్లీనిక్స్ నడుపుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

హామీలను అమలు చేయాలి : ఎన్పీఆర్డీ కేంద్ర కమిటీ సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్పీఆర్డీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, సి.సాయమ్మ, జె.రాజు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని, పెన్షన్ రూ.6వేలకు పెంచి అమలు చేయాలని అన్నారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యశోద, ఉపేందర్, స్వామి, సహాయ కార్యదర్శులు గంగాధర్, లింగన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, కవిత, భాగ్యలక్ష్మి, చంద్రమోహన్, బాలయ్య, శశికల, భుజంగారెడ్డి, మల్లేష్, ప్రభుస్వామి, శేఖర్ గౌడ్, కుర్మయ్య, పాముకుంట్ల చందు, లలిత, గౌతమ్, యాదయ్య, రాష్ట్ర నాయకులు మంగమ్మ, ఉష, రాజు, జంగయ్య, రమేష్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ రాష్ట్ర సదస్సులో ఎం సాయిబాబు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సిఐటియు జాతీయ కోశాధికారి, నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ అండ్ అల్కైడ్ వర్కర్స్ జాతీయ కన్వీనర్ ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఆరోగ్యమ్మ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సుమారు 22 వేల ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీల ఆధ్వర్యంలో కోటి మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారని తెలిపారు. అన్ని విభాగాల వద్ద పనిచేస్తున్న వీరి జీవన పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయకుండా అత్యధిక చోట్ల 12 గంటల పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఐడెంటిటీ కార్డులు, యూనిఫామ్, షూస్, టార్చ్‌లైట్ తదితర రక్షణ పరికరాలను ఏజెన్సీల నుంచే ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ కార్మికుల నుంచే డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. మే 20న అఖిల భారత సార్వత్రిక సమ్మెలో ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్, ఇతర అనుబంధ కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర కన్వీనర్ యాటల సోమన్న కార్యాచరణ ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ, శంకర్, జ్యోతి లక్ష్మి, రమాదేవి, సుజాత, గోవర్ధన్, గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థపై బిజెపి దాడి

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం న్యాయవ్యవస్థపైనా దాడి చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. బిజెపికి అధికార వాంఛ తప్ప దేశంపైనా, ప్రజలపైనా ఎలాంటి ప్రేమ లేదని చెప్పారు. ఈ దేశం విచ్ఛిన్నమైనా పర్వాలేదుగానీ అధికారమే పరమావధిగా పనిచేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకుండా నియంతృత్వంగా పాలన సాగిస్తోందని వివరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగంబద్ధ పదవిలో ఉన్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ కూడా ఇటీవల సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా వాఖ్యానించారని గుర్తు చేశారు. కేంద్రం నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించొద్దనే ధోరణి పెరుగుతోందని చెప్పారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలకు సమాన హక్కులు ఉండే విధంగా రాజ్యాంగ రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు దాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి కుట్రలు పన్నుతోందని విమర్శించారు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సేకు గుడి కట్టే రోజులు కూడా దగ్గర్లోనే ఉన్నాయన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ అధికారం చేపట్టిన 11 ఏండ్లలో ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను భౌతికంగా నిర్మూలిస్తోందన్నారు. దేశంలో వామపక్ష శక్తులు బలోపేతం కావాల్సిన అవసరముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర వాదంపై సహనం అవసరం లేదు

- జస్టిస్ చంద్ర కుమార్

ప్రజాశక్తి - కల్చరల్

శాంతి కాముక దేశం అయినా ఉగ్రవాదం పట్ల సహనం అవసరం లేదని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై ఆనంద లహరి, త్యాగరాయ గానసభల నిర్వహణలో ఇటీవల జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో పహల్గం వద్ద జరిగిన ఉగ్ర వాదుల దాడిలో మతి చెందిన వారికి నివాళి, ఉగ్ర వాదం పట్ల నిరసన తెలుపుతూ సభ జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులను హత్య చేయడం అమానుషం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ భారత్ దేశం యావత్తూ కేంద్ర ప్రభుత్వం ఉగ్ర వాదంపై తీసుకునే చర్యలకు మద్దతు ప్రకటించాయి అని గుర్తు చేశారు. ఆనంద లహరి స్థాపకుడు వందే భారత్ సినీ నిర్మాత దర్శకుడు మల్లం రమేష్ మాట్లాడుతూ దేశ భక్తి ప్రజల్లో కలిగించేందుకు కష్ట నష్టాలకు ఓర్చుకోనీ వందే భారత్ సినిమా తీశామని చెప్పారు. ఉగ్ర వాదం మన దేశ అభివృద్ధికి అటకం అని సమూలంగా సీమాంతర ఉగ్ర వాదం అంతం కావాలని అన్నారు. వంశీ రామరాజు బాలసాహిత్య రచయిత చొక్కాపు రమణ సంఖ్య శాస్త్ర వేత్త గోపి కృష్ణ, కళా కారులు వసంత్ భవిరి శివ సత్యనారాయణ నిస్సార్, మానిక్ వేణు గోపాల్ కాపర్తి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగాలలో సేవకు గుర్తింపు కావాలి

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి కల్చరల్

సాంస్కృతిక రంగాలలో వివిధ రకాల సేవ చేసిన వారిని గుర్తించి గౌరవించడం అవసరమని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. అట్టి వారిని సత్కరిస్తున్న రసమయి సంస్థకు అభినందనలు తెలిపారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై రసమయి ప్రముఖ సాంస్కృతిక సంస్థ నిర్వహణలో సాంస్కృతిక రంగంలో వివిధ ప్రక్రియలు లో కృషి చేస్తున్న పిఎస్ కోటేశ్వరరావు, రామరాజు లక్ష్మి శ్రీనివాస్, డాక్టర్ కావూరి శ్రీనివాస్, పి ఖదీర్ బాబు, డాక్టర్ మర్రి కృష్ణా రెడ్డి డాక్టర్ కెవి జ్ఞాన కుమార్‌లను సత్కరించి ఆచార్య ఇనాక్ అభినందించారు. అధ్యక్షత వహించిన కేంద్ర పూర్వ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ రసమయి సంస్థ గత ఏభై ఏడుఏళ్లుగా నాణ్యమైన కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ జీవితానికి సార్థకత సాహిత్యం కళలను ఆరాధించడమన్నారు. రసమయి రాము జీవితం ధన్య మన్నారు. నరసింహప్ప విడి రాజగోపాల్ పాల్గొన్న సభకు డాక్టర్ ఎంకె రాము స్వాగతం పలికారు. ఆశాలత వ్యాఖ్యనం చేయగా తొలుత లక్ష్మి శ్రీనివాస్ వీణా వాదన ఆకట్టుకుంది.

ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు పరిష్కరించాల్సిందే

- లేకుంటే 7న సమ్మెకు సిద్ధం
- టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో



ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, లేకుంటే మే 7వ తేదీ నుంచి సమ్మె తప్పదని వక్తలు తేల్చి చెప్పారు. ఆర్‌టిసి పరిరక్షణ, ప్రభుత్వ హామీలు, ఆర్‌టిసిలో సమ్మె అంశాలపై జాతీయ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో జరిగింది. దీనికి జేఏసీ చైర్మెన్, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షత వహించారు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.నరసింహా మాట్లాడుతూ.. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోతే.. గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సమ్మె జరగొద్దని తాము కోరుకుంటున్నామని, సమ్మెపై జేఏసీ జనవరి 27న ఇచ్చిన నోటీసుపై యాజమాన్యం నుంచిగానీ, ప్రభుత్వం నుంచిగానీ ఎలాంటి స్పందనా లేకపోవడం వల్లే సమ్మె అనివార్యంగా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె నోటీసుపై జేఏసీతో చర్చలు జరపకుండా కార్మికులను రెచ్చగొడుతున్నారని, అందుకు యాజమాన్యం, ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీఎంతో పాటు మంత్రుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లామని, అక్కడి నుంచి ఎలాంటి స్పందనా రాలేదని తెలిపారు. తమ చివరి అస్త్రంగా సమ్మెకు దిగాల్సిన గత్యంతరం ఏర్పడిందన్నారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ మాట్లాడుతూ.. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వెంటనే ఆర్‌టిసి కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడాలని కోరారు. ఆర్‌టిసి సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ మాట్లాడుతూ.. ఆర్థిక భారంతో సంబంధం లేని డిమాండ్లకు సంబంధించిన అంశాలను క్లియర్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వం బేషజాలకు పోవద్దన్నారు. ఆర్‌టిసి సంఘాలను భేషరతుగా చర్చలకు పిలవాలని, సమ్మె జరగకుండా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జాతీయ సభ్యులు విజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, ఆర్‌టిసి ఉద్యోగులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. జెఎసి చైర్మన్, కో-చైర్మెన్, వైస్ చైర్మన్ వెంకన్న, హనుమంతు ముదిరాజ్, థామస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిసిలో కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. యాజమాన్యం చిత్రహింసలకు గురి చేస్తుందని, ఎనిమిది గంటల పనిదినాలను పాటించకుండా 16 గంటలు అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో సాంకేతిక లోపాలున్న పరికరాన్ని ఉపయోగిస్తూ డ్రైవర్ల తప్పిదం లేకపోయినా ఉద్యోగం నుంచి యాజమాన్యం తొలగిస్తోందని తెలిపారు. పదేండ్లలో 16 వేల మంది ఉద్యోగ విరమణ చేసినా కొత్త నియామకాలు చేపట్టలేదన్నారు. 1200 బస్సులను తగ్గించారన్నారు. వీటి స్థానంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చారని తెలిపారు. ప్రయివేట్ బస్సులు కాకుండా.. ఆర్‌టిసి సంస్థనే ఎలక్ట్రికల్ బస్సులను కొనే విధంగా సబ్సిడీ అందజేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గత ప్రభుత్వం గెజిట్ జారీ చేసి రెండేండ్లు కావస్తున్నా అపాయింటెడ్ డేట్ ప్రకటించడానికి ఎందుకు జాప్యం జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. యూనియన్ల పునరుద్ధరణ విషయంలోనూ ఆర్‌టిసి యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గత ప్రభుత్వం హయాంలో 53 రోజులు సమ్మె చేశామని, అదే సంకల్పంతో ఈసారీ సమ్మెకు దిగుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు, జెఎసి కన్వీనర్ ఎండి మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరి, ఐఎఫ్‌టియు నాయకులు రమేష్, టిఎయంయు నాయకులు బి యాదయ్య, ఎన్ కమలాకర్ గౌడ్, ఎం హెచ్ అలీ, టిజెఎంయు నాయకులు డివికె రావు, వి.బాబు, ఎండి రహీముద్దీన్, బి శ్రీనివాస్, ఎం వెంకటేష్, వెంకట్ గౌడ్, కె రాంరెడ్డి, స్వాములయ్య ప్రసగించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

- న్యాయ శాఖ కార్యదర్శి ఆర్ తిరుపతికి ఐలూ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధుల బృందం మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తిరుపతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2019 జూన్ తరువాత న్యాయవాదులుగా నమోదు అయిన వారందరికీ హెల్త్ కార్డులు తక్షణమే జారీ చేయాలనీ, మరణించిన న్యాయవాదుల పేర్లను జాబితా నుంచి తొలగించి, ట్రస్ట్ ప్రీమియం ఇన్సూరెన్స్ కంపెనీకి వృథాగా చెల్లించకుండా చూడాలని కోరారు. ప్రతి ఏడాది బార్ కౌన్సిల్ నుంచి న్యాయవాదుల తాజా జాబితాను సేకరించి, దాని ప్రకారం హెల్త్ కార్డులు జారీ చేయాలనీ, ప్రస్తుత రూ.2 లక్షల బీమా పరిమితిని రూ. పది లక్షలు వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిని తొలగించి, న్యాయవాదుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, ప్రసవం సహా అన్ని రకాల చికిత్సలకు హెల్త్ కార్డులు వర్తింపజేయాలని విన్నవించారు.

ప్రజలను పోరాటమార్గాన నడిపించేది ఎర్రజెండానే

- సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు
- ప్రజా సమస్యలపై భువనగిరిలో భారీ ర్యాలీ
- వందలాది మందితో సిపిఎం ప్రదర్శన, మహాధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేది.. ప్రజలను పోరాటాల్లో పాల్గొనేలా చైతన్యం చేసేది ఒక్క ఎర్రజెండానే అని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. ప్రజాసమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనం నుంచి వందలాది మందితో ప్రారంభమైన పాదయాత్ర జిల్లా కలెక్టరేట్ వరకు ఐదు కిలోమీటర్లు ర్యాలీగా వెళ్లింది. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. గతంలో బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో అనేక హామీలు ఇచ్చి సక్రమంగా అమలు చేయక ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ రావాల్సిన వాటాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పహల్గాంలో జరిగిన దాడి కేంద్ర ప్రభుత్వ రక్షణ విభాగానికి సంబంధించిన నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయిందని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే చిన్న నీటి ప్రాజెక్టులు బస్వాపూర్ రిజర్వాయర్, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, గంధమల్ల, శివన్నగూడెం రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం కరువైందని, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక, అందుబాటులో ఉన్న ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యం అందక గాంధీ, ఉస్మానియాలాంటి ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు నిర్ణయించిన వారికి కాకుండా గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసాచారి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, బొడ్డుపల్లి వెంకటేశం, ఎండి పాషా, బొల్లు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.